క్లుప్తంగా

రెడ్ కార్పెట్ ఎగ్జిబిషన్‌కు విశేష స్పందన



పాత గుంటూరు: రింగ్ రోడ్డులోని శుభమ్ కన్వెన్షన్ సెంటర్లో నిర్వహిస్తున్న రెడ్ కార్పెట్ ఫ్యాషన్ లైఫ్ స్టైల్ ఎగ్జిబిషన్‌కు నగర ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందని నిర్వాహకులు ఆర్.కె.నాయుడు, శైలజారామ్ తెలిపారు. క్లాతింగ్, జ్యూయలరీ, హోమ్ డెకార్స్‌కు సంబంధించిన 40 స్టాల్స్ అందుబాటులో ఉన్నాయని చెప్పారు. గురువారం రాత్రి 9 గంటల వరకు మాత్రమే ఈ ఎగ్జిబిషన్ ఉంటుందని, ఈ అవకాశాన్ని నగర ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

అబ్రహం వెస్లీకి పీహెచ్‌డీ



గుంటూరు ఎడ్యుకేషన్: లాడ్జి సెంటర్లోని ఏఎల్ బీఈడీ కళాశాలలో కార్యాలయ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న అబ్రహం వెస్లీ సాపాటి ఏఎన్‌యూ నుంచి విద్యా విభాగంలో పీహెచ్‌డీ పట్టా పొందారు. ఆయన ఏఎల్ బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్తేరు సునీల పర్యవేక్షణలో సెకండరీ స్కూల్ విద్యార్థుల్లో విద్యా పరమైన విషయాల్లో ఒత్తిడి, సర్దుబాటుపై పరిశోధన చేశారు. ఈ సందర్భంగా బుధవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ అబ్రహం వెస్లీని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్తేరు సునీల అభినందించారు.

చలో రాజమండ్రికి వెళ్లకుండా ముందస్తు నోటీసులు

గుంటూరు ఈస్ట్: చలో రాజమండ్రికి అనుమతి లేదంటూ మూడు పోలీసు స్టేషన్ల పరిధిలో బాలకృష్ణ ఫ్యాన్స్‌కు పోలీసులు ముందస్తు నోటీసులు జారీ చేశారు. చంద్రబాబుకు మద్దతుగా గురువారం బాలకృష్ణ ఫ్యాన్స్ చలో రాజమండ్రికి పిలుపునిచ్చింది. పశ్చిమ డీఎస్పీ పరిధికి చెందిన అరండల్‌పేట, నగరంపాలెం, పట్టాభిపురం పోలీసు స్టేషన్ల పరిధిలో పది మందికి రాజమండ్రికి వెళ్లకుండా ముందస్తు నోటీసులు అందజేశారు.

వ్యక్తిపై దాడి

రెండిళ్ల మధ్య గోడ పగులగొట్టడంతో పాటు పక్కింటి యజమానిపై దాడి చేసిన వ్యక్తిపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. నలందానగర్ 3వ లైనులో నూతలపాటి మల్లికార్జునరావు, ఉమాశంకర్ పక్క పక్క ఇళ్లల్లో నివాసం ఉంటున్నారు. మల్లికార్జునరావు తన ఇంటి దక్షిణం వైపు గోడ ఎత్తు పెంచాడు. దాన్ని గతనెల 27న ఉమాశంకర్ పడేశాడు. దీన్ని అడిగినందుకు ఉమాశంకర్, అతని సోదరుడు కలసి మల్లికార్జునరావుపై దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు బుధవారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

షాపు యజమానులపై కేసు నమోదు

ప్రముఖ బ్రాండ్ దుస్తుల్ని అనుకరిస్తూ నకిలీ దుస్తులు విక్రయిస్తున్న షాపు నిర్వాహకులపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. కృష్ణనగర్ మెయిన్ రోడ్డులో ఆషిక్ ట్రెండ్స్ దుస్తుల షాపు ఉంది. ఇందులో ప్రముఖ బ్రాండ్‌లను అనుకరిస్తూ డూప్లికేట్ దుస్తులు విక్రయిస్తున్నారు. దీనిపై కంపెనీల ప్రతినిధి సయ్యద్ మొహమ్మద్ షారూఖ్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వలంటీర్‌ను దూషించిన వ్యక్తిపై...

మహిళా వలంటీర్‌తో పాటు ముఖ్యమంత్రి, కార్పొరేటర్‌ను దుర్భాషలాడిన వ్యక్తిపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. కొమ్మతోటి ఆదిలక్ష్మి 111వ సచివాలయ వలంటీర్‌గా పని చేస్తున్నారు. గత నెల 29న నేతాజీ నగర్ 6వ లైనులో విధుల్లో ఉన్న సమయంలో తోట రాజశేఖర్‌కు ఫోన్ చేసి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగారు. అతడు ఆదిలక్ష్మి వద్దకు వచ్చి సీఎంను, ప్రభుత్వ పథకాలను, కార్పొరేటర్‌ను విమర్శిస్తూ దుర్భాషలాడాడు. కులం పేరుతో వలంటీర్‌ను దూషించాడు. అనంతరం ఆమెను చేతులతో నెట్టాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


'ఊపిరి'ని కాపాడుకుందాం.. ఆరోగ్యంగా ఉందాం

- పెరుగుతున్న ఊపిరితిత్తుల వ్యాధుల బాధితులు
- కరోనా విపత్తులో కీలకంగా మారిన పల్మనాలజిస్టులు
- అక్టోబర్ నెల హెల్తీ లంగ్ మంత్

గుంటూరు మెడికల్: మనిషి శ్వాస తీసుకుని, ప్రాణాలతో ఉండటానికి ఊపిరితిత్తులు ఎంతో కీలకం. సాధారణంగా ఒక్క రోజులో దాదాపు 25,000 సార్లు ఊపిరి తీసుకుంటాడు. మనం పీల్చే గాలిలో ఆక్సిజన్, నత్రజని, తక్కువ మొత్తంలో ఇతర వాయువులు, తెలియాడే బ్యాక్టీరియా, వైరస్, వాతావరణంలో ఉండే వివిధ రకాల కాలుష్య కారకాలు ఉంటాయి. ఊపిరితిత్తులు ఆక్సిజన్‌ను శరీరం అంతా పంపిణీ చేస్తాయి. ఆధునిక జీవన శైలి వల్ల సమస్యలు ఉత్పన్నమై ఊపిరి తీసుకోవడం కష్టమై పోయి కొంత మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా అక్టోబరు నెలను 'హెల్తీ లంగ్ మంత్'గా నిర్ణయించి ఊపిరితిత్తుల వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

బాధితులు అధికమే..

గుంటూరు జిల్లాల్లో 50 మంది పల్మనాలజిస్టులు (ఊపిరితిత్తుల స్పెషాలిటీ వైద్య నిపుణులు) సేవలందిస్తున్నారు. ఒక్కో డాక్టర్ వద్దకు ప్రతి రోజూ 30 నుంచి 50 మంది సమస్యలతో చికిత్స కోసం వస్తున్నారు. కరోనా సమయంలో ఊపిరితిత్తుల సమస్యలకు చికిత్స చేసే పల్మనాలజిస్ట్‌ల పాత్ర బాగా పెరిగింది. కోవిడ్-19 వచ్చి కోలుకున్న పిదప తిరిగి కొంత మందికి పోస్ట్ కోవిడ్ కాంప్లికేషన్స్ వస్తున్నాయి. ఇలాంటి వారికి పల్మనాలజిస్టులు సకాలంలో మెరుగైన వైద్యం అందించి ప్రాణాలు రక్షిస్తున్నారు.



వరల్డ్ లంగ్ డే పోస్టర్

ఊపిరితిత్తులకు వచ్చే జబ్బులు

ప్రతి ఏడాది ప్రపంచ వ్యాప్తంగా ఏడులక్షల మంది పిల్లలు ఊపిరితిత్తులకు వచ్చే నిమోనియా వ్యాధితో చనిపోతున్నారు. వారిలో 80శాతం మంది రెండేళ్ల లోపు పిల్లలే. ప్రతి రెండు నిమిషాలకు ఒక పిల్లవాడు నిమోనియాతో చనిపోతున్నాడు. ప్రతి ఏడాది 384 మిలియన్ల మంది ఊపిరితిత్తుల సంబంధమైన సీవోపీడీ వ్యాధి బారిన పడుతున్నారు. 30 లక్షల మంది చనిపోతున్నారు. ఊపిరితిత్తులకు వచ్చే ఆస్తమా వ్యాధితో 33.4 కోట్ల మంది బాధపడుతుండగా, లంగ్ క్యాన్సర్‌తో 1.76 కోట్ల మంది చనిపోతున్నారు. ప్రతి ఏడాది పది మిలియన్ల ప్రజలు ఊపిరితిత్తుల టీబీ బారిన పడుతుండగా, 1.5 మిలియన్ల మంది చనిపోతున్నారు. ప్రతిరోజూ 4,383 మంది టీబీతో చనిపోతున్నారు.

ఊపిరితిత్తుల వ్యాధులు గుర్తించడం ఎలా?

ఎక్కువగా దగ్గు, ఆయాసం, పిల్లి కూతలు, ఛాతి పట్టి వేయడం లాంటి లక్షణాలు కనిపిస్తే అది సీఓపీడీ వ్యాధిగా గుర్తించాలి. తరచుగా జలుబు చేయడం, వళ్లు దురద, కళ్ల మంటలు, కొన్ని రకాల ఆహార పదార్థాలు, వాసనలు సరిపడకపోవడం లక్షణాల్ని ఎలర్జీగా గుర్తించాలి. జ్వరం, కళ్లెతో కూడిన దగ్గు, శ్వాస తీసుకునేటప్పుడు ఛాతి నొప్పి ఉంటే దాన్ని నిమోనియా వ్యాధిగా భావించాలి. రెండు వారాలకు మించి దగ్గు, సాయంత్రం వేళల్లో జ్వరం, ఆకలి తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే ఊపిరితిత్తుల క్షయ వ్యాధిగా గుర్తించాలి. దగ్గుతున్నప్పుడు రక్తం పడడం, బరువు తగ్గడం, ఆకలి లేకపోవడం లంగ్ క్యాన్సర్ లక్షణాలు. పొడి దగ్గు, ఆయాసం, కీళ్ల నొప్పులు ఉంటే ఊపిరితిత్తులకు వచ్చే ఐఎల్‌డీ వ్యాధిగా గుర్తించాలి.

వీరికి రిస్క్ ఎక్కువ

ధూమపానం, పొగతో కూడిన ప్రాంతాలు, పొగాకు ఉత్పత్తులు వినియోగించేవారు, ఫ్యాక్టరీల్లో పనిచేసే వారు, వడ్రంగి పనులు చేసేవారు, పొగతో కూడిన వాహనాలను రిపేర్లు చేసేవారు, చిన్న పిల్లలు, వృద్ధులు, ఎక్కువగా ఊపిరితిత్తుల వ్యాధి బారిన పడే అవకాశం ఉంది.

ముందస్తు చర్యలు తీసుకోవాలి



ఊపిరితిత్తుల వ్యాధుల్ని ముందస్తు జాగ్రత్తలతో చాలా వరకు నివారించవచ్చు. గుట్కా, పాన్ పరాగ్, ఖైనీ, పొగతాగడం మానేయాలి. మంచి ఆహారపు అలవాట్లు కలిగిఉండాలి. అలర్జీ పదార్థాలకు దూరంగా ఉండాలి. వైరస్‌ల బారిన పడకుండా ఇంట్లోంచి బయటకు వచ్చే సమయంలో తప్పనిసరిగా ముఖానికి మాస్క్ ధరించాలి. భౌతిక దూరం పాటించాలి. జన సంచారం ఉండే ప్రాంతాలకు దూరంగా ఉండాలి. తరచూ శానిటైజర్‌తో చేతులు శుభ్రం చేసుకోవాలి. దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు ముఖానికి ఖర్చీఫ్ అడ్డుపెట్టుకోవాలి.

– డాక్టర్ బి. దుర్గాప్రసాద్, పల్మనాలజిస్ట్, గుంటూరు

వ్యాక్సిన్లతో రక్షణ



క్రమం తప్పకుండా ఇన్‌ఫ్లూయెంజా, నిమోకోకల్ వ్యాక్సిన్లు వేయించుకోవడం వల్ల జలుబు, నిమోనియా లాంటి ఊపిరితిత్తుల జబ్బుల బారిన పడకుండా ఉండవచ్చు. గుంటూరులోని ప్రభుత్వ ఛాతి, సాంక్రమిక వ్యాధుల హాస్పిటల్‌లో ప్రతిరోజూ 80 మంది వరకు ఊపిరితిత్తుల సమస్యల బాధితులు చికిత్స పొందుతున్నారు. ఆస్పత్రిలో అన్ని వైద్య పరీక్షలు ఉచితంగా చేసి మందులు కూడా ఉచితంగా అందిస్తున్నాం. పౌష్టికాహారంతో పాటు, ప్రతి రోజూ కనీసం 30 నిమిషాలు వ్యాయామం, ప్రాణాయామం, చేయడం వల్ల ఊపిరితిత్తుల సామర్థ్యాన్ని పెంపొందించుకోవచ్చు.

– డాక్టర్ శ్రీకంటి రఘు, సూపరింటెండెంట్, ప్రభుత్వ ఛాతి, సాంక్రమిక వ్యాధుల ఆస్పత్రి, గుంటూరు

ఆర్వో, ఆర్ఐ సస్పెన్షన్

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థలో పని చేస్తున్న ఆర్వో(రెవెన్యూ ఆఫీసర్), ఆర్ఐ(రెవెన్యూ ఇన్‌స్పెక్టర్)ను సస్పెండ్ చేస్తూ నగర కమిషనర్ కీర్తి చేకూరి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. నగదు తీసుకుని పన్ను పేరు మార్పు(టైటిల్ టాన్స్‌ఫర్) చేయకుండా రెవెన్యూ అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ నగరానికి చెందిన ఓ పారిశ్రామికవేత్త కమిషనర్ కీర్తి చేకూరికి ఫిర్యాదు చేశారు. దీని మేరకు క్షేత్ర విచారణ చేపట్టిన అనంతరం రెవెన్యూ ఆఫీసర్ రవికుమార్‌ను, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఉదయరంగను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

తోపుడు బండ్ల పంపిణీ

పట్నంబజారు: ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి జన్మదిన వారోత్సవాల్లో భాగంగా బుధవారం వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య ఆధ్వర్యంలో బృందావన్ గార్డెన్స్‌లోని ఎమ్మెల్సీ అప్పిరెడ్డి కార్యాలయంలో చిరు వ్యాపారులకు తోపుడు బండ్లను జీడీసీసీ బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు (లాలుపురం రాము) ముఖ్యఅతిథిగా హాజరై అందజేశారు. గుంటూరు అర్బన్ బ్యాంకు డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, కార్పొరేటర్లు ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి), పార్టీ నేతలు, డివిజన్ అధ్యక్షులు, విద్యార్థి విభాగం నేతలు పాల్గొన్నారు. భవానీనగర్‌లోని మదరసాలో విద్యార్థులకు మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఉర్దూ ఘర్, షాదీఖానా కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, నూనె ఉమామహేశ్వర రెడ్డి, కార్పొరేటర్ షేక్ రోషన్ పాల్గొన్నారు.

ఇంటింటి నుంచి నూరు శాతం చెత్త సేకరణ

కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: నగరంలో ఇంటింటి చెత్త సేకరణ నూరు శాతం జరగాలని, పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉండే కార్యదర్శులు, అధికారులపై కఠిన చర్యలు తప్పవని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. ఆమె బుధవారం పొన్నూరు రోడ్ గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ (జీటీఎస్), కోబాల్ట్‌పేట, లక్ష్మీపురం, వెంకట రమణ కాలని, ఎన్‌జీవో కాలని, సంగడిగుంట, పట్నం బజార్ తదితర ప్రాంతాల్లో ఆకస్మికంగా పర్యటించారు. పారిశుద్ధ్య నిర్వహణపై ప్రజారోగ్య కార్యదర్శులకు, ఇన్‌స్పెక్టర్లకు పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో వార్డ్ సచివాలయం వారీగా ఇంటింటి చెత్త సేకరణ నూరు శాతం జరగాలని ఆదేశించారు. మధ్యాహ్నం ప్రాధాన్యత క్రమంలో గ్యాంగ్ వర్క్ జరగాలని, కార్మికులు, కార్యదర్శులు, ఇన్‌స్పెక్టర్ల హాజరు నివేదిక ప్రతి రోజు ఇవ్వాలని ఎంహెచ్‌వోని ఆదేశించారు. ఈ-ఆటోల ద్వారా సేకరించిన వ్యర్థాల్ని జీటీఎస్‌లకు తరలించేప్పుడు సమయపాలన ఉండాలని, ట్రిప్పుల రిజిస్టర్ మెయిన్‌టెన్ చేయాలని చెప్పారు. జటీఎస్ దగ్గర త్వరగా అన్‌లోడ్ అయ్యేలా అదనపు సిబ్బంది, కంపాక్టర్‌లను అందుబాటులో ఉంచాలని ఇంజినీరింగ్ అధికారుల్ని ఆదేశించారు. నగరంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి సచివాలయం పరిధిలో యాంటీ లార్వా నివారణకు డొమిస్టిక్ ప్రాంతాల్లో స్టాక్ సొల్యూషన్ స్ప్రే, కాల్వల్లో అవసరం మేరకు ఎబెట్ ద్రావణం, బీటీఐ లిక్విడ్, పౌడర్, డైఫ్లూ బెంజిరాన్, మలేరియా లార్విసైడ్ ఆయిల్, రంపపు పొట్టు, ఆయిల్ బాల్స్ వేయాలని చెప్పారు. శివారు, నీరు నిల్వ ఉండే ఖాళీ స్థలాలు, బావులు, చెరువులు, కుంటల్లో గంబూషియా చేపలని వదలాలని ఆదేశించారు.



పారిశుద్ధ్య కార్మికుడి నుంచి వివరాలు తెలుసుకుంటున్న కమిషనర్ కీర్తి చేకూరి

ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలని వినతి

నగరపాలక సంస్థలో వివిధ కారణాలతో సస్పెన్షన్‌కు గురైన ఉద్యోగుల్ని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు చాంద్ బాషా కమిషనర్ కీర్తి చేకూరికి విన్నవించారు. ఈ మేరకు బుధవారం కమిషనర్‌ను నగరపాలక సంస్థ కార్యాలయంలో కలసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు కరీ ముల్లా, శ్యామ్, కోటా సాహెబ్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సీఎం జగన్ పాలన



వైఎస్సార్‌కు నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా, నూరిఫాతిమా, కార్పొరేటర్ రవి

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా

పట్నంబజారు: ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరిఫాతిమా చెప్పారు. నియోజకవర్గంలోని ఐదో డివిజన్ రామిరెడ్డితోటలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి వారి సమస్యలు తెలుసుకోవడంతో పాటు, ఆయా కుటుంబాలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేకూర్చిన లబ్ధిని వివరించారు. సైడు కాల్వల్లో వ్యర్థాలు పేరుకుపోతున్నాయని స్థానికులు ఎమ్మెల్యే ముస్తఫా దృష్టికి తెచ్చారు. స్పందించిన ఆయన స్వయంగా తీయడంతో పాటు, సిబ్బందికి పలు సూచనలు చేసి పూడికతీతను తీయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ ఏ ప్రాంతానికి వెళ్లినా అపూర్వ స్పందన లభిస్తోందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలతో, లబ్ధితో ప్రజలు ఎంతో సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో సైతం వైఎస్సార్ సీపీ విజయదుందుభి మోగించడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరిఫాతిమా మాట్లాడుతూ పేద వర్గాలకు తానున్నానే భరోసా కల్పించిన ఘనత సీఎం వై.ఎస్. జగన్‌కే దక్కుతుందని తెలిపారు. అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ఆయన పరిపాలన సాగిస్తున్నారని, కచ్చితంగా రానున్న ఎన్నికల్లో మరోమారు సీఎం జగన్‌ను తిరిగి ఆశీర్వదించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ యాట్ల రవి, శ్యామల, జీవన్, మస్తాన్, తోట ఆంజనేయులు, ఎండీ ఫారూక్, పూనూరి నాగేశ్వరరావు, మాధవ చిన్న, వెంకటేశ్వరరెడ్డి, జీపీరెడ్డి, సతీష్, కోలా భవాని, దుర్గాప్రసాద్, గనిక ఝాన్సీ, మాధవరావు, రాంబాబు పాల్గొన్నారు.

ప్రకృతిని రక్షించుకుందాం పుస్తకావిష్కరణ

ఏఎన్‌యూ: ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం సందర్భంగా బుధవారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో డాక్టర్ తూముచారి రాజేంద్రప్రసాద్ రచించిన ప్రకృతిని రక్షించుకుందాంఅనే పుస్తకాన్ని వీసీ ఆచార్య పి. రాజశేఖర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతగా గుర్తించాలని సూచించారు. నానాటికీ పెరిగిపోతున్న అధిక ఉష్ణోగ్రతలు, సునామీలు, భూకంపాలు, తుపాన్లు అన్నీ కూడా ప్రకృతి విధ్వంసం వల్లే జరుగుతున్నాయని చెప్పారు. ఇది ప్రపంచం ముందున్న పెను సమస్యని పేర్కొన్నారు. ప్రభుత్వ అధికారులతో పాటు ప్రతి ఒక్కరూ భాగస్వాములై ప్రకృతిని రక్షించుకుందామని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రచయిత డాక్టర్ రాజేంద్రప్రసాద్ సేవల్ని, ప్రకృతి పరిరక్షణకు చేస్తున్న కృషిని కొనియాడారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ రాజశేఖర్, రచయిత రాజేంద్రప్రసాద్ తదితరులు

కార్యక్రమంలో గుంటూరు హిందూ కళాశాల తెలుగు ప్రొఫెసర్ ఎల్లాప్రగడ మల్లికార్జునరావు, ఇంగ్లిష్ ప్రొఫెసర్ డాక్టర్ బాలసారి, శ్రీనివాసరావు, జై లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

సే'వా' లంటీర్



గుంటూరు రూరల్: నిత్యం సేవా దృక్పథం, సేవకు ప్రతిరూపంగా వలంటీర్లు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందించటంలో దూసుకుపోతున్నారు. ఈ క్రమంలో వెంగళాయపాలెం గ్రామ సచివాలయం 2 కు చెందిన వలంటీర్ రేటూరి విజయసాగర్ తన సేవా దృక్పథాన్ని చాటుకున్నాడు. గ్రామానికి చెందిన రావిపాటి రాధాకృష్ణవేణి అనే 90 ఏళ్ళ వృద్ధురాలు గ్రామ క్లస్టర్ 13లో నివాసం ఉండేవారు. గత కొన్ని రోజులుగా ఆమె అనారోగ్యంతో బాధపడుతూ మెరుగైన వైద్య సేవల నిమిత్తం హైదరాబాదులోని భందువుల ఇంట్లో ఉంటూ వైద్యం తీసుకుంటున్నారు. పింఛన్ సమయం రావటంతో హైదరాబాద్‌లో ఉన్నారని తెలిసిన వలంటీర్ తన సొంత ఖర్చులతో హైదరాబాదుకు వెళ్ళి రాధాకృష్ణవేణికి పింఛన్‌ను అందించి వచ్చాడు. సేవా దృక్పథంతో హైదరాబాదు వెళ్ళి పింఛన్‌ను అందించిన వలంటీర్‌ను గ్రామ ప్రజలు తోటి వలంటీర్లు, గ్రామ సచివాలయం ఉద్యోగులు అభినందించారు.

మార్కెట్లోకి పల్సర్ ఎన్ 150 బైక్ విడుదల

పాత గుంటూరు: అమరావతి రోడ్డులోని శ్రీ సిద్ధి వినాయక బజాజ్ షోరూంలో పల్సర్ ఎన్ 150 బైక్‌ను బుధవారం మార్కెట్లోకి విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డెప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ కరీం పాల్గొని, బైక్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బజాజ్ అందరి మనసులో హమారా బజాజ్‌గా ఉందని తెలిపారు. పల్సర్ ఎన్ 150ను స్టైల్, పెర్ఫార్మెన్స్‌బైకుగా కంపెనీ డిజైన్ చేసిందని చెప్పారు. యువత ఆదరించాలని ఆయన కోరారు. జనరల్ మేనేజర్ జి. శ్రీనివాస్ మాట్లాడుతూ పల్సర్ 150 బైక్ ఎక్స్ షోరూం ధర రూ.1,17,798గా ఉందన్నారు. వైట్, రెడ్, బ్లాక్ రంగులతో ఐదు గేర్లతో అందుబాటులోకి వచ్చిందని చెప్పారు. దసరా పండుగ పురస్కరించుకుని షోరూంలో ఈనెల 31వ తేదీ వరకు ఆకర్షణీయమైన ఆఫర్లు ప్రకటించినట్లు తెలిపారు. పల్సర్ ఎన్ 150 బైక్‌పై రూ. 5వేలు క్యాష్ బ్యాక్, 125 నియాన్ డిస్క్‌పై రూ. 5వేలు, 125 కార్బన్ ఫైబర్ బైకుపై రూ. 2వేలు, సిటీ 110 ప్లాటినా 100, 110 సీసీ బైక్‌లపై రూ. 2వేలు క్యాష్ బ్యాక్ ఆఫర్లు ప్రకటించినట్లు వెల్లడించారు. ప్రజలంతా అభిమాన బజాజ్ బైకును కొనుగోలు చేసి బంపర్ ఆఫర్ పొందాలని ఆయన కోరారు. కార్యక్రమంలో టీం లీడర్ యోగి, షోరూం ఇన్‌చార్జ్ బాలకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.



బైక్‌ను ఆవిష్కరించిన డీటీసీ షేక్ కరీం

ముస్లింలకు అన్ని రంగాల్లో పెద్దపీట

ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి

పట్నంబజారు: ముస్లింలకు రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అన్ని రంగాల్లో పెద్దపీట వేశారని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి చెప్పారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా ఆయన పేరిట గుంటూరులో ఏర్పాటు చేసిన ఉర్దూ ఘర్, షాదీఖానా కమిటీ ఆధ్వర్యంలో ఏటా నిరుపేద విద్యార్థులకు పంపిణీ చేసే ఉపకార వేతనాలకు సంబంధించి ప్రత్యేకంగా రూపొందించిన బ్రోచర్‌ను బుధవారం బృందావన్ గార్డెన్స్‌లోని కార్యాలయంలో ముస్లిం మత పెద్దలతో కలసి ఆవిష్కరించారు. ఎమ్మెల్సీ అప్పిరెడ్డి మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా రాష్ట్రంలో ముస్లింలకు తగిన గుర్తింపు, గౌరవం ఇచ్చిన ఘనత సీఎం జగన్‌కు మాత్రమే దక్కుతుందని తెలిపారు. ముస్లింల మేలు కోసం ఎంతో చేస్తున్న ఆయనకు ముస్లిం సమాజం మొత్తం అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌బత్తుల దేవానంద్, ముస్లిం మత పెద్దలు హఫీజ్ అబ్బాస్, హఫీజ్ ఇర్షాద్, హఫీజ్ ఇసాక్, మోలానా అబ్దుల్ రెహ్మాన్, ప్రభుత్వ క్వాజీ హఫీజ్ ఉస్మాన్‌సిద్ధిఖీ, ముఫ్తీ మన్సూర్, కార్పొరేటర్లు మార్కెట్ బాబు, షేక్ రోషన్, మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఉర్దూ ఘర్, షాదీఖానా కమిటీ బాధ్యులు షేక్ ఫరియాజ్, నజీర్, గౌస్, బాబు, ఖుద్దూస్, పార్టీ నేతలు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, ముస్లిం మత పెద్దలు

ప్రజల ఆరోగ్యానికి రక్ష 'జగనన్న సురక్ష'

గుంటూరు రూరల్: వార్డ్ సచివాలయాల వారీగా అనారోగ్య సమస్యలు ఉన్న ప్రజలు జగనన్న ఆరోగ్య సురక్షని సద్వినియోగం చేసుకునేలా సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు అవగాహన కల్పించాలని నగర మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. బుధవారం 26వ డివిజన్ చౌడవరం గ్రామంలో వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్‌ను స్థానిక కార్పొరేటర్ శ్యామల వెంకటరమణదేవితో కలిసి పరిశీలించారు. ప్రజలతో మాట్లాడి క్యాంప్ నిర్వహణపై అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష అనారోగ్య సమస్యలు ఉన్న వారికి గొప్ప అవకాశమన్నారు. ఎంతో ఖరీదైన వైద్యం, మందులు ఉచితంగా క్యాంప్‌లో అందించడం జరుగుతుందన్నారు. ఇప్పటికే వార్డ్ సచివాలయం ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు, వలంటీర్లు ఇంటింటికి వెళ్లి సురక్ష క్యాంప్‌పై అవగాహన కల్పించడం, అనారోగ్యంగా ఉన్న వారిని గుర్తించడం జరిగిందన్నారు. క్యాంప్‌లో మహిళలకు, పురుషులకు ప్రత్యేక కౌంటర్లు, సమాచారం కోసం వార్డ్ సచివాలయ కార్యదర్శిని నియమించడం, తాగునీరు, మొబైల్ టాయ్‌లెట్స్ ఏర్పాటు చేశామన్నారు. మందులు ఇచ్చేందుకు కూడా కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. నేరుగా క్యాంప్‌లో స్పాట్ రిజిస్ట్రేషన్ చేసి తగిన వైద్య పరీక్షలు చేస్తున్నారన్నారు. ఎవరికైనా ఉన్నత వైద్యం అవసరమైతే ప్రభుత్వ లేదా ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ హాస్పిటల్‌కు రిఫర్ చేయడం జరుగుతుందన్నారు. క్యాంప్‌లో జనరల్ మెడిసిన్ స్పెషలిస్ట్, గైనకాలజిస్ట్‌తో పాటు ఇద్దరు వైద్యులు అందుబాటులో ఉంటారన్నారు. క్యాంప్ ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగుతుందని, క్యాంప్‌లో డిప్యూటీ కమిషనర్లు, ఎంహెచ్‌ఓ, ప్రజారోగ్య అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. ఏ సమస్య ఎదురైనా వారిని సంప్రదించవచ్చని పేర్కొన్నారు. అనంతరం క్యాంప్‌లో కళ్ళు పరీక్ష చేయించుకొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, సీహెచ్.శ్రీనివాస్, ఎంహెచ్‌ఓ డాక్టర్ భాను ప్రకాష్, ఈఈ కొండారెడ్డి, జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ రత్న మన్మోహన్, అంకిరెడ్డిపాలెం మాజీ సర్పంచ్ శ్యామల బ్రహ్మారెడ్డి, మెడికల్ ఆఫీసర్స్ తదితరులు పాల్గొన్నారు.



కంటి పరీక్షలు చేయించుకుంటున్న కమిషనర్ చేకూరి కీర్తి